# 4. ప్రకృతి ధర్మం

**నేపథ్యం:** అమ్మ మనసు మెత్తగా
పిట్ట కూత కమ్మగా
పుట్ట తేనె తియ్యగా
చెట్టు నీడ చల్లగా..
ఉంటాయని మనకు తెలుసు కదా!
అంటువంటి చెట్లని మనం రక్షిస్తే
అవి మనల్ని రక్షిస్తాయి.
అనే విషయాన్ని ఋజువు చేస్తున్న
ఈ పాఠాన్ని ఇప్పుడు చదువుదామా!



పూర్వం ధనపురి అనే గ్రామముండేది. అది పాడిపంటలకు సిరి సంపదలకు నిలయమై విలసిల్లేది. ఊరికి సమీపంలో ఉన్న కొండలను, వనాలను ఆ ఊరి ప్రజలు దేవతలుగా కొలిచేవారు. ఊళ్ళో చెట్లను నాటి బిడ్డల్లా సాకేవారు.

ధనపురి గ్రామస్తులకు ఒక నియమం ఉండేది. వంటకయినా, ఇంటి నిర్మాణానికయినా ఎండి మోడైన చెట్లనే ఉపయోగించాలి. పచ్చని చెట్ల జోలికి పోరాదు.

తరాలు మారాక ఆ గ్రామంలో ఊరివాళ్ల బుద్ధులు పెడదారి పట్టాయి. ప్రజలు ధనాశాపరులయ్యారు. సంపాదన కోసం కలప వ్యాపారం ప్రారంభించారు. అందువల్ల ఊరు చుట్టు ప్రక్కల ఉన్న చెట్లు తగ్గిపోయాయి. కొండల మీదున్న చెట్లు తగ్గిపోయాయి. పచ్చగా మిసమిసలాడే పరిసరాలు బోసిపోయాయి.

అప్పటి నుంచి ధనపురి వాసులకు కష్టాలు ప్రారంభమయ్యాయి. ఆ ప్రాంతంలో వర్షాలు తగ్గిపోసాగాయి. పొలాలు బీడుగా మారిపోయాయి. కరువంటే ఎలా ఉంటుందో ధనపురి ప్రజలకు తెలిసొచ్చింది. అమ్మి, డబ్బు చేసుకోవడానికి చెట్లన్నీ అయిపోయాయి.



**ఉక్తలేఖనం:–** ● గ్రామస్తులు ● పచ్చని చెట్టు ● చుట్టుప్రక్కల ● ఆశ్చర్యపోవుట ● గడ్డిమొక్కలు ● విలసిల్లు

చేసేదేమీ లేక ప్రజలు బతుకుదెరువు కోసం వలస పోయారు. కొన్నాళ్లకు ధనపురి మట్టిదిబ్బయింది.

చాలా సంవత్సరాల తరువాత పుట్టిన ఊరు మీద మమకారంతో ఒక వ్యక్తి ధనపురి చూడడానికి వచ్చాడు. దారంతా మొక్కలు, గుబురు పొదలతో నిండి ఉంది. అక్కడక్కడా కొత్తగా వెలసి పెరుగుతున్న చెట్లు కనిపించాయి. ఆ ప్రాంతం అడవిని తలపించింది. వచ్చిన వ్యక్తి పరిసరాలను చూస్తూ ఆశ్చర్యపోసాగాడు. గ్రామముండే ప్రాంతంలో అడుగు పెట్టేసరికి అతడికి ఊరిమధ్యలో ఒక పూరిపాక కనిపించింది. దగ్గరకు వెళ్ళి చూసేసరికి అందులో ఒక సాధువు కనిపించాడు.

మొదట బిత్తరపోయి తరువాత తేరుకొని ఆ వ్యక్తి సాధువుకు నమస్కరించి, స్వామీ నా పేరు వీరయ్య గతంలో ధనపురి వాసిని! కరవొచ్చిపడడంతో అందరితోపాటు నేనూ ఊరు విడిచి వెళ్లాను. ఇక్కడ నేను చూస్తున్నది చిత్రంగా ఉంది. నీటి చుక్కలేని చెరువులు నీటితో నిండుగా కనిపించాయి. చెట్టూ చేమ అంతరించిన ప్రాంతం పచ్చదనంతో కళకళలాడుతుంది. ఇది ఎలా సాధ్యమయింది?'' అని అడిగాడు.

దానికి సాధువు మందహాసం చేశాడు. ''నాయనా! వికసించడం ప్రకృతి సహజ గుణం! స్వార్థపరుల వల్లనే మీ ఊరికి కరువు వచ్చింది. మీరంతా ఎప్పుడయితే ఈ ప్రాంతం వదిలి వెళ్లారో హాని జరగడం తగ్గింది. ప్రకృతి దానికదే వికసించింది. ఇందులో వింతలేదు!'' వీరయ్య సందేహాలను తీర్చాడు సాధువు!

సాధువు మాటలు విన్న వీరయ్య ఆ మాటల్లోని సత్యాన్ని గుర్తించాడు. క్రమేపీ ఊరి జనమంతా తిరిగి ధనపురికి వచ్చి చేరారు.
పర్యావరణానికి భంగం కలుగకుండా జీవించడం అలవర్చుకున్నారు.
ధనపురి పూర్వవైభవాన్ని పొంది ఆదర్శగ్రామమయింది.

## I. వినండి-సంభాషించండి.

1. గ్రామాలకు, పట్టణాలకు ఉన్న సామ్య భేదాలు.
2. చెట్లవలన ఉపయోగాలు.

## II. కొత్త పదాలు తెలుసుకుందాం.

సిరిసంపదలు = ఐశ్వర్యము;
పెడదారి = తగని మార్గము;
తరగిపోవు = తగ్గిపోవు; మమకారము = ప్రేమ;
భంగము కలుగకుండా = అడ్డురాకుండా.

## III. పాఠాన్ని ఒక్కొక్కరుగా తరగతిలో ప్రకాశవఠనం చేయండి.

## IV. వినండి-ఆలోచించండి-రాయండి.

### అ. ఒక్కొక్క వాక్యంలో సమాధానాలు రాయండి.

1. ధనపురి ప్రజలు వేటిని ఆరాధించేవారు?
2. తరాలు మారడంతో ప్రజలు ఏ విధంగా మారారు?
3. చెట్లు తగ్గిపోవడంతో గ్రామంలో ఏం మార్పు వచ్చింది?
4. ప్రకృతి సహజగుణమేంటి?

### ఆ. మూడు, నాలుగు వాక్యాల్లో సమాధానాలు రాయండి.

1. ధనపురి వాసులకు ఎప్పటి నుంచి కష్టాలు ప్రారంభమయ్యాయి?
2. ధనపురిని చూడటానికి వచ్చిన వ్యక్తి ఎందుకు ఆశ్చర్యపోయాడు?
3. 'ప్రకృతి ధర్మం' అన్న పాఠం నుండి మీరు ఏం తెలుసుకున్నారు?


### ఇ. పాఠంలోని జంట పదాలను ఏరి రాయండి

ఉదా:- పాడిపంటలు

1. ______________________
2. ______________________
3. ______________________

## సృజనాత్మకత

- రాయండి-ఆనందించండి.
- ఉపాధ్యాయుని సహాయంతో ఒక ప్రశ్నావళిని తయారు చేసుకొని మీ పరిసరాలలోని ప్రజలు వలస వచ్చుటకు గల కారణాలను ముఖాముఖి ద్వారా తెలుసుకొని నమోదు చేసుకోండి.
- మీ పరిసరాలలోని కొందరు స్వగ్రామం నుండి వలస వచ్చుటకు గల కారణాలను అడిగి తెలుసుకొని పక్కనున్న ఆకృతిలో రాయండి.




## భాషతో ఆడుకుందాం. భాష నేర్చుకుందాం:

కర్ర గాని కర్ర = జీలకర్ర

హారం గాని హారం = ____________

దేహం గాని దేహం = ____________

మామ గాని మామ = ____________

దేశం గాని దేశం = ____________

దారం గాని దారం = ____________

కాయ గాని కాయ = ____________

దార గాని దార = ____________




## అవగాహన చేసుకుందాం-అనువాదం చేద్దాం – తగిన చిత్రాన్ని గడిలో గీద్దాం.

गावाजवळ नदी,
नदीत पाणी।
तीरावर झाड,
झाडावर चिमणी।
चिमणी गाई,
चिववचिव गाणी।

____________________
____________________
____________________
____________________
____________________
____________________

## V. భాషావగాహన

### అ. వాక్యాంగాలు గుర్తించి పట్టికలో రాయండి.

1. ప్రజలు చెట్లను బిడ్డల్లా సాకేవారు.
2. ప్రజలు కలప వ్యాపారం ప్రారంభించారు.
3. సాధువు వీరయ్య సందేహాలను తీర్చాడు.

| కర్త | కర్మ | క్రియ |
|---|---|---|
| | | |
| | | |
| | | |

ఆ. గీతగీసిన పదాలను పాఠంలోని సమానార్థక పదాలతో పూరించండి.

1. పర్యావరణానికి ఇబ్బంది కలుగకుండా జీవించారు.
2. ఒక వ్యక్తి పుట్టిన ఊరి మీద ప్రేమతో ధనపురికి వచ్చాడు.
3. ఊరి మధ్యలో ఒక గుడిసె కనిపించింది.
4. వీరయ్య ఆ మాటల్లోని నిజాన్ని గ్రహించాడు.

ఇ. గీతగీసిన పదాలు కుండలీకరణంలో ఇచ్చిన భాషాభాగాలతో రాయండి. (నామవాచకం, అవ్యయం, విశేషణం, సర్వనామం, క్రియ)

1. ఊరు చుట్టుప్రక్కల ఉన్న చెట్లు తగ్గిపోయాయి.
2. అప్పుడు ఊరి ప్రజలకు కష్టాలు ప్రారంభమయ్యాయి.
3. వీరయ్య ధనపురి చూడటానికి వచ్చాడు.
4. అతడికి ఊరిమధ్యలో ఒక పూరిపాక కన్పించింది.
5. వ్యవసాయం చేసి చక్కని ఫలితం సాధించాడు.

ఈ. 'చెట్లను మనం రక్షిస్తే, మనల్ని చెట్లు రక్షిస్తాయి'' అనే అంశంపై పది వాక్యాలలో వ్యాసం రాయండి.



కింది వాక్యాలను గమనించండి.

1. చుట్టం చూసిపోదామని వచ్చెను.
2. ఆమె అతని మంచి చెడ్డలు అడిగింది.

పై వాక్యాలు 'నిశ్చయ' విషయాన్ని తెలియజేయుచున్నవి, ఇట్టి వాక్యాలను **''నిశ్చయార్థక వాక్యాలు''** అని అంటారు.

1. అతడు పాఠశాలకు రాలేదు. 2. నాకు పాట పాడటం రాదు.

పై వాక్యాలలో భావం వ్యతిరేకమైన అర్థాన్ని తెలుపుతున్నాయి. ఇట్టి వాక్యాలను **''వ్యతిరేకార్థక వాక్యాలు''** అని అంటారు.

1. నీవు ఎక్కడికి వెళ్ళావు? 2. ఈ రోజు పాఠశాలకు సెలవా?

పై వాక్యాలు ఇతరులను అడుగుతున్నట్లుగా ఉన్నవి. ఇతరులను ప్రశ్నించునట్లు ఉండే ఇటువంటి వాక్యాలను **'ప్రశ్నార్థక వాక్యాలు'** అని అంటారు.

1. ఆహా! నెమలి ఎంత అందంగా పురివిప్పి ఆడుతోంది. 2. ఔరా! ఎంతపని చేశావు.

పై వాక్యాలు ఆశ్చర్యాన్ని, విచారాన్ని తెలియజేయుచున్నవి. ఇటువంటి వాక్యాలను **'ఆశ్చర్యార్థక' వాక్యాలు** అని అంటారు.

- కింది వాక్యాలను ప్రకాశపఠనం చేసి అవి ఏ రకానికి చెందినవో గుర్తించి రాయండి.

1. ఊళ్ళో చెట్లను నాటి బిడ్డల్లా సాకేవారు.
2. నాయనా! వికసించడం ప్రకృతి సహజగుణం.
3. పచ్చని చెట్ల జోలికి పోరాదు.
4. ఇది ఎలా సాధ్యమయింది?

నేనివి నేర్చుకున్నా.

- ప్రకృతి వనరులను పొదుపుగా వాడుకొనుట.
- చెట్లను నాటుట, రక్షించుట.



# మహిళా శాస్త్రవేత్తలు

పఠనం :



**ఫుట్‌పెడల్ ట్రాష్‌కేన్:–** ఒంగకుండా, కాలితోనొక్కి చెత్తడబ్బా మూతని తెరిచే పద్ధతిని **లిలియన్** అనే అమెరికన్ మహిళ కనిపెట్టింది. ఫ్రిజ్ తలుపు లోపల షెల్ఫులు, ఎలక్ట్రిక్ ఫుడ్ మిక్సర్ ఇంకా వంటగదిలో ఉపయోగించే ఎన్నింటినో ఆమె కనిపెట్టింది.



**పేపర్ బేగ్:–** 1860లో **మార్గరెట్‌నైట్** అనే ఆమె పేపర్ ఫ్యాక్టరీలో పని చేస్తూ పేపర్ బేగ్‌ని తయారు చేసే యంత్రాన్ని కనుగొంది. ఇంకా రోటరీ ఇండేన్ షో కటింగ్ మిషన్ లాంటి అనేక యంత్రాలు కనిపెట్టింది.



**డిష్ వాషర్:–** ఐశ్వర్యవంతుడైన వ్యాపారి భార్య **జోసెఫీన్** తరచు పార్టీలు ఇచ్చేది. పాత్రలు కడిగేటప్పుడు పనివాళ్ళు కప్పులని పగలకొడుతుండటంతో అంట్లు తోమే యంత్రాన్ని 1886లో కనిపెట్టి పేటెంట్ పొంది, 1961లో 'వర్ల్‌పూల్' కార్పొరేషన్‌కు అమ్మింది.



**విండ్ షీల్డ్ వైపర్స్:–** 1900 లో వర్షంలో లేదా మంచులో బస్‌ని డ్రైవ్ చేసేప్పుడు డ్రైవర్ మధ్య మధ్యలో వాహనాన్ని ఆపి ముందు అద్దం తుడవడం గమనించిన **మేరీ ఏండర్సన్** అద్దాన్ని యాంత్రికంగా తుడిచే విండ్ షీల్డ్ వైపర్స్‌ని కనుక్కుంది. ఇప్పుడు వైపర్స్ లేని కార్లే లేవు.

**పై పత్రికా కత్తిరింపును చదివి ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**

1. డిష్‌వాషర్‌ను ఎవరు కనిపెట్టారు?
2. మేరీ ఏండర్సన్ విండ్ షీల్డ్ వైపర్ ఏ విధంగా కనిపెట్టింది?
3. వ్యతిరేక పదాలు రాయండి.
   1. కష్టపడు x    2. లోపల x
4. పర్యాయపదాలు రాయండి.
   1. మహిళ :    2. హిమము:

**ప్రాజెక్టుపని :–** మీకు నచ్చిన కొందరు శాస్త్రజ్ఞులు – వారి వివరణలు – ఆవిష్కరణలు గురించి అంతర్జాలంలో విషయాన్ని సేకరించి చిత్రాలతో సహా ఆల్బమ్ తయారు చేయండి.